


EVENING EDITION

నేటి దినపత్రిక
# సూర్య
www.suryaa.com

4PM
www.suryaa.com
మంగళవారం
06 ఆగస్టు 2024
పేజీలు: 02




## మెడల్స్ టేబుల్

| దేశం | బంగారం | వెండి | కాంస్యం | మొత్తం |
|---|---|---|---|---|
| అమెరికా | 21 | 30 | 28 | 79 |
| చైనా | 21 | 18 | 14 | 53 |
| ఫ్రాన్స్ | 13 | 16 | 19 | 48 |
| ఆస్ట్రేలియా | 13 | 12 | 8 | 33 |
| బ్రిటన్ | 12 | 13 | 17 | 42 |
| జపాన్ | 10 | 5 | 11 | 26 |
| ఇండియా | 0 | 0 | 3 | 3 |



## నేడు ప్రొఫెసర్
# జయశంకర్ జయంతి

నేడు ఆగస్టు 6 తెలంగాణ సిద్ధాంతకర్త ఆచార్య కొత్తపల్లి జయశంకర్ సార్ జయంతి. తెలంగాణే శ్వాసగా.. తెలంగాణే ధ్యాసగా.. తెలంగాణ లక్ష్యంగా బ్రతికి ..ఎంతోమందిలో ఉద్యమ స్ఫూర్తిని రగిలించారు ఆచార్య కొత్తపల్లి జయశంకర్. తెలంగాణ రాష్ట్ర సాధనలో ఆయన పాత్ర మరువలేనిది. బంగారు తెలంగాణ కోసం తన జీవితాన్ని అంకితం చేసిన పోరాట యోధుడు ఆయన. ఉద్యమ స్ఫూర్తి ప్రధాతగా ఆయన ప్రజలను ముందుండి నడిపించారు.



## పుట్టుక మీది.. చావు మీది.. బతుకంతా తెలంగాణది: కేటీఆర్

ప్రొ.జయశంకర్ తెలంగాణ రాష్ట్ర సాధన కోసం తన జీవితాన్ని ధారబోశారని కేటీఆర్ ట్వీట్ చేశారు. జయశంకర్ జయంతి సందర్భంగా నివాళులు అర్పించారు. 'పుట్టుక మీది, చావు మీది.. బతుకంతా తెలంగాణది. ఉద్యమ భావజాల వ్యాప్తికి ఆయన చేసిన కృషి అనిర్వచనీయం. స్వరాష్ట్ర సాధనలో ఒక దిక్సూచిగా నిలిచిన వారి కీర్తి అజరామరమైనది. ఆయన అడుగు జాడల్లోనే తెలంగాణ పోరాటం. తెలంగాణ ప్రగతి ప్రస్థానం' అని పేర్కొన్నారు.



## జయశంకర్ అడుగు జాడల్లోనే తెలంగాణ రాష్ట్ర సాధన: కేసీఆర్

తెలంగాణ స్వరాష్ట్ర సిద్ధాంతకర్త ప్రొఫెసర్ జయశంకర్ జయంతి సందర్భంగా తెలంగాణ రాష్ట్ర సాధనకై ఆయన చేసిన కృషిని, త్యాగాన్ని భారాస అధినేత కేసీఆర్ స్మరించుకున్నారు. వారి అడుగుజాడల్లో తాను మలిదశ తెలంగాణ ఉద్యమానికి సారథ్యం వహించి, చివరి దాకా శాంతియుత పద్ధతిలో ప్రజా ఉద్యమాన్ని కొనసాగించి, అరవై ఏళ్ల స్వయంపాలన ఆకాంక్షను నిజం చేసుకున్నామని కేసీఆర్ అన్నారు.



## నిఖార్సైన తెలంగాణవాది
### తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

కవి, గాయకుడు, సామాజిక ఉద్యమకారుడు, ప్రజా యుద్ధనౌక స్వర్గీయ గద్దర్ గారి వర్ధంతి సందర్భంగా ముఖ్యమంత్రి శ్రీ రేవంత్ రెడ్డి ఆ మహనీయుడికి నివాళి అర్పించారు. 'రాజరికం కత్తి మీద నెత్తురుల గాయమా.. దొరవారి గడులల్లో నలిగిపోయిన న్యాయమా..' అంటూ పాటలతోనే పోరు బాటలు వేసిన నిఖార్సైన తెలంగాణవాది, పొడుస్తున్న పొద్దులో వినిపించే ప్రజా విముక్తి గీతం గద్దరన్న అని ఒక సందేశంలో ముఖ్యమంత్రి గారు కొనియాడారు. ప్రజా ప్రభుత్వం ఏర్పడిన తర్వాత గద్దర్ పేరిట సాంస్కృతిక-సినీ అవార్డులను నెలకొల్పిన విషయాన్ని ఈ సందర్భంగా గుర్తు చేశారు.



## ఆరోగ్య, జీవిత బీమాపై
# జీఎస్టీ తగ్గించండి
### పార్లమెంట్ ఆవరణలో విపక్ష సభ్యుల ఆందోళన

ఆరోగ్య, జీవిత బీమా పాలసీలపై ఉన్న 18 శాతం జీఎస్టీని తగ్గించాలని విపక్ష ఇండియా కూటమి పార్టీల సభ్యులు డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం పార్లమెంట్ సమావేశాలు ప్రారంభానికి ముందు నిరసన తెలిపారు. పార్లమెంట్ భవనం మకర ద్వారం ముందు ప్లకార్డులను ప్రదర్శించారు. ఆరోగ్య, జీవిత బీమా పాలసీలపై ఉన్న 18 శాతం జీఎస్టీని వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. కాగా, టీఎంసీ నేత డెరిక్ ఒబ్రెయిన్ సోమవారం ఈ అంశాన్ని పార్లమెంట్‌లో లేవనెత్తిన విషయం తెలిసిందే. అధిక పన్ను ప్రజలకు భారంగా మారుతున్నట్లు తెలిపారు. రాజ్యసభలో జీరో అవర్‌లో ఆయన మాట్లడారు. కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ కూడా ఇదే రకమైన డిమాండ్ చేసినట్లు ఆయన ఆర్థిక మంత్రికి రాసిన లేఖలో పేర్కొన్నారు. ఇండియాలో ఇన్సూరెన్స్ కేవలం 4 శాతమే ఉన్నదని, ప్రపంచవ్యాప్తంగా అది ఏడు శాతంగా ఉందని, బీమా రంగంలో అసమానతలు ఉన్నాయని, 75 శాతం జీవిత బీమా పాలసీలు ఉన్నాయని, మరో 25 శాతం వైద్య బీమాలు ఉన్నట్లు ఒబ్రెయిన్ తెలిపారు. హెల్త్ ఇన్సూరెన్స్‌లపై జీఎస్టీని తగ్గించాలని కోరుతూ పశ్చిమ బెంగాల్ సీఎం మమతా బెనర్జీ కూడా కేంద్ర ఆర్థిక మంత్రికి లేఖ రాసినట్లు ఆయన చెప్పారు. ప్రతిపక్ష ఎంపీలు కూడా ఈ డిమాండ్ చేసినట్లు గుర్తు చేశారు. ప్రభుత్వం తమను పట్టించుకోవడం లేదని, ఆర్థిక మంత్రి కనీసం రోడ్లు, రవాణా శాఖ మంత్రి గడ్కరీ వ్యాఖ్యలను అయినా ఆలకించాలని టీఎంసీ ఎంపీ తెలిపారు.జీఎస్టీ మండలి మాత్రమే దీనిపై నిర్ణయం తీసుకుంటుందని ప్రభుత్వం చెప్పిన విషయాన్ని ఎంపీ ఒబ్రెయిన్ తిరస్కరించారు. ఆ వాదనలో వాస్తవం లేదన్నారు. మండలిలో ఎన్డీఏకు మెజారిటీ ఉన్నదని, కావాలంటే దీన్ని మార్చవచ్చు అని తెలిపారు.

జీవిత, వైద్య బీమా పథకాలపై జీఎస్టీ వద్దు.. నిర్మలా సీతారామన్‌కు నితిన్ గడ్కరీ లేఖ లైఫ్ ఇన్సూరెన్స్, హెల్త్ ఇన్సూరెన్స్ ప్రీమియంలపై చెల్లించే జీఎస్టీని తొలగించాలని కేంద్ర ఆర్థిక శాఖను కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ కోరారు. ఈ మేరకు కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌కు ఇటీవలే లేఖ రాశారు. నాగ్‌పూర్ డివిజనల్ లైఫ్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ ఎంప్లాయిస్ యూనియన్ నుంచి వచ్చిన మెమోరాండం ప్రకారం లేఖ రాస్తున్నట్లు గడ్కరీ తెలిపారు. 'యూనియన్ లేవనెత్తిన ప్రధాన సమస్య లైఫ్, హెల్త్ ఇన్సూరెన్స్ ప్రీమియంలపై జీఎస్టీ ఉపసంహరణకు సంబంధించినది. ఈ రెండింటిపై 18 శాతం పన్ను ఉంది. జీవిత బీమా ప్రీమియంపై జిఎస్టీ విధించడం అనేది అనిశ్చితిపై పన్ను విధించడం కిందకే వస్తుంది. కుటుంబానికి కొంత రక్షణ కల్పించడానికి తీసుకునే జీవిత బీమాపై పన్ను విధించకూడదని యూనియన్ భావిస్తోంది. అదేవిధంగా, వైద్య బీమా ప్రీమియంపై 18 శాతం జీఎస్టీ అనేది సమంజసం కాదు. సామాజికంగా అవసరమైన ఈ విభాగం వ్యాపార వృద్ధికి అడ్డంకిగా మారుతోంది. అందుకే వీటిపై జీఎస్టీని ఉపసంహరించుకోవాలని యూనియన్ కోరుతోంది' అని నితిన్ గడ్కరీ తన లేఖలో వివరించారు.



## 3000మీ స్టిపుల్ చేజ్
# ఫైనల్లో సాబ్లె

ఒలింపిక్స్‌లో అథ్లెటిక్స్‌లో పతకం రావడం ఖాయంలా కనిపిస్తోంది. అస్సలు అంచనాలు లేని...ఆ ఆటలో మన ప్లేయర్లు ఉన్నారని కూడా తెలియని దానిలో ఫైనల్స్‌లోకి దూసుకెళ్లారు అథ్లెట్ అవినాష్. 3000m స్టీపుల్ ఛేజ్‌లో ఫైనల్‌కు చేరిన తొలి భారతీయుడుగగా చరిత్ర సృష్టించారు. ఈ ఈవెంట్‌లో ఫైనల్‌కు చేరిన మొదటి భారతీయుడిగా నిలిచారు. రౌండ్-1లో అవినాష్ 8.15.43 సెకెన్ల సమయంలోనే గమ్యాన్ని చేరుకున టాప్ -5లో ఒకరిగా ఉన్నారు. దీంతో ఈ నెల 8న జరిగే ఫైనల్లో అవినాష్ పోటీ పడనున్నారు. ఇందులో కనుక మొదటి మూడు స్థానాలో ఏ ఒక్క దానిలో నిలిచినా కచ్చితంగా పతకం వస్తుంది. టేబుల్ టెన్నిస్ ప్రిక్వార్టర్స్‌లో 3-2 తేడాతో రొమేనియాపై విజయం సాధించిన మనికా బాత్రా, ఆకుల శ్రీజ, అర్చనా కామత్‌లతో కూడిన భారత జట్టు క్వార్టర్స్‌కు చేరింది. ఈ విజయంతో ఒలింపిక్స్‌లో టేబుల్ టెన్నిస్ మహిళల ఈవెంట్‌లో క్వార్టర్ ఫైనల్‌కు చేరుకున్న తొలి భారత జట్టుగా రికార్డ్ క్రియేట్ చేసింది.




## రూ.5,999కే జియో 5జీ ఫోన్.. మతిపోగొడుతున్న ఫీచర్లు!

గత కొంతకాలంగా స్మార్ట్‌ఫోన్ మార్కెట్‌లో 5G స్మార్ట్‌ఫోన్ల వహా నడుస్తుంది. టెక్ కంపెనీలు ఈ సెగ్మెంట్‌లో భారీగా పోటీపడుతున్నాయి. అయితే ఇప్పుడు తాజాగా ఈ పోటీలోకి టెలికాం దిగ్గజం జియో కూడా ఎంట్రీ ఇచ్చింది. బడ్జెట్ స్మార్ట్‌ఫోన్ మార్కెట్‌లో సత్తా చాటేందుకు సిద్ధమైంది. ప్రీమియం ఫీచర్లతో 5జీ ఫోన్ తీసుకురానుంది. దీని ధర చాలా తక్కువగా ఉండే అవకాశం ఉంది. ఈ ఫోన్ పూర్తి వివరాలను ఇప్పుడు తెలుసుకుందాం.. రిలయన్స్ జియో త్వరలో కొత్త 5G స్మార్ట్‌ఫోన్‌ను పరిచయం చేయనుంది. ఫోన్ ధర నుండి కొన్ని ప్రత్యేక ఫీచర్లు ఇప్పటికే లీక్ అయ్యాయి. ఫీచర్లను చూస్తుంటే స్మార్ట్‌ఫోన్ చాలా పెద్ద కంపెనీలకు సమస్యలను సృష్టించే అవకాశం ఉందని తెలుస్తోంది. అతి తక్కువ ధరకే ఈ ఫోన్ రూ.5,999 అందుబాటులోకి రానుంది. ఫోన్‌లో హై రిసొల్యూషన్ కెమెరా ఉండే అవకాశం ఉంది.జియో ఈ రాబోయే కొత్త 5G స్మార్ట్‌ఫోన్ గొప్ప డిజైన్‌తో రాబోతోంది. ఇందులో మీరు 6.7 అంగుళాల సూపర్ అమోలెడ్ డిస్‌ప్లేను ఉండొచ్చని సమాచారం. ఫోటోగ్రఫీని ఇష్టపడే వ్యక్తులు ఈ ఫోన్‌తో అద్భుతమైన ఫోటోలను క్యాప్చర్ చేయవచ్చు. ఫోన్ 12,32 లేదా 50MP కాకుండా 100MP ప్రైమరీ కెమెరా సెటప్‌తో వచ్చే అవకాశం ఉంది. ఇది కాకుండా ఫోన్‌లో 16MPఅల్ట్రా వైడ్ కెమెరాను చూడవచ్చు. సెల్ఫీలు, వీడియో కాల్‌ల కోసం ఫోన్‌లో 32MP ఫ్రంట్ ఫేసింగ్ కెమెరా ఉంటుంది. ఫోన్‌లో 6700mAh బ్యాటరీ ఉంది. ఇది 120వాట్ల సూపర్ ఫాస్ట్ ఛార్జింగ్‌కు సపోర్ట్ ఇస్తుంది. జియో ఈ చీపెస్ట్ 5G ఫోన్ మూడు ఇంటర్నల్ స్టోరేజ్ వేరియంట్‌లలో వచ్చే అవకాశం ఉంది.

## ట్రెండింగ్‌లో
# దేవర సాంగ్

ఎన్టీఆర్, జాన్వీ కపూర్‌ల జోడి ఎలా ఉంటుందో అని అంతా అనుకున్నారు. తాజాగా దేవర నుంచి వదిలిన చుట్టమల్లే అంటూ సాగే రెండో పాటతో అందరికీ ఓ క్లారిటీ వచ్చేసింది. ఎన్టీఆర్, జాన్వీ కపూర్ జంట కెమిస్ట్రీ అదిరిపోయిందని ఈ లిరికల్ వీడియోని చూస్తే తెలుస్తుంది. రొమాంటిక్ మెలోడీ పాటలో రామజోగయ్య సాహిత్యం అదిరిపోయింది. అనిరుధ్ బాణీ వినసొంపుగా ఉంది. శిల్ప గాత్రం కూడా ఈ పాటకు స్పెషల్ అట్రాక్షన్‌గా నిలిచింది. 'చుట్టమల్లె' అంటూ సాగె ఈ పాటను చిత్ర యూనిట్ విడుదల చేసింది. ఇప్పటికే ఎన్టీఆర్ 'దేవర' ఫియర్ సాంగ్ కి అదిరిపోయే రెస్పాన్స్ వచ్చింది. ఈ సినిమాకు రాక్ స్టార్ అనిరుధ్ సంగీతాన్ని సమకూరుస్తున్నాడు. దేవర పార్ట్-1 సెప్టెంబర్ 27న ప్రపంచ వ్యాప్తంగా విడుదల కానుంది.



నేటి దినపత్రిక సూర్య www.suryaa.com EVENING EDITION 4PM



## బంగ్లాదేశ్‌లో హోటల్‌కు నిప్పు.. 18కి చేరిన మృతుల సంఖ్య

బంగ్లాదేశ్‌లోని జెస్సోరిలో ఉన్న ఓ హోటల్‌పై జరిగిన దాడి భారీ అగ్నిప్రమాదానికి దారి తీసింది. దీంతో ఆ ప్రమాదంలో మృతిచెందిన వారి సంఖ్య 18కి చేరుకున్నది. జెస్సోరి ఫైర్ సర్వీస్ అసిస్టెంట్ డైరెక్టర్ ఎంప మమున్ ఈ విషయాన్ని ధ్రువీకరించారు. షాహిన్ చక్లదార్ అనే వ్యక్తి ఆ హోటల్ ఓనర్. అవామీ లీగ్ పార్టీకి చెందిన జెస్సోరీ జిల్లా ప్రధాన కార్యదర్శి అతను.హోటల్‌కు సాయంత్రం 4 గంటలకు నిప్పుపెట్టారు. దాన్ని రాత్రి 8 గంటలకు ఆర్పారు. అగ్ని ప్రమాదంలో ఇద్దరు ప్రాణాలు కోల్పోయారు. వారిని 20 ఏళ్ల చయ్యాన్, 19 ఏళ్ల సేజన్ హుస్సేన్‌గా గుర్తించారు. అగ్ని ప్రమాదంలో చిక్కుకుని అస్వస్థతకు గురైన సుమారు 150 మందిని జెస్సోరీ ఆస్పత్రిలో చేర్పించినట్లు రెసిడెంట్ మెడికల్ ఆఫీసర్ తెలిపారు. మాజీ ప్రధాని షేక్ హసీనా తన పదవికి రాజీనామా చేసి విదేశాలకు పారిపోయిన నేపథ్యంలో.. సోమవారం బంగ్లాదేశ్ లక్షలాది మంది వీధుల్లోకి వచ్చి సంబరాలు జరుపుకున్నారు. ఆ సమయంలో కొందరు వ్యక్తులు.. జెస్సోర్‌లోని చిత్తమోర్ ప్రాంతంలో ఉన్న జాబిర్ హోటల్‌కు నిప్పుపెట్టారు. ఆ హోటల్‌లో ఉన్న ఫర్నీచర్‌ను ధ్వంసం చేశారు. జిల్లాలోని అవామీ లీగ్ ఆఫీసుతో పాటు అవామీ లీగ్ నేతలకు చెందిన మూడు ఇండ్లపై అటాక్ చేశారు.

## యూకే ఆశ్రయమిచ్చేదాకా..
# భారత్‌లోనే షేక్ హసీనా!

రిజర్వేషన్ల వ్యతిరేక ఆందోళనలతో బంగ్లాదేశ్‌లో అల్లకల్లోల పరిస్థితులు నెలకొనడంతో ఆ దేశ ప్రధాని షేక్ హసీనా పదవి నుంచి వైదొలిగి దేశం వీడిన సంగతి తెలిసిందే. ప్రస్తుతం ఆమె భారత్‌కు రాగా.. మరి కొంత కాలం ఇక్కడే ఉండనున్నట్లు తెలుస్తోంది. ఈ మేరకు హసీనాకు భారత ప్రభుత్వం అనుమతులు ఇచ్చినట్లు జాతీయ మీడియా కథనాలు వెల్లడించాయి. షేక్ హసీనా రాజకీయ శరణార్థిగా యూకేలో ఆశ్రయం కోరినట్లు సమాచారం. దీనిపై బ్రిటన్ ప్రభుత్వం ఇంకా ఎలాంటి నిర్ణయం తీసుకోలేదు. దీంతో యూకే ప్రభుత్వం నుంచి అనుమతులు వచ్చేవరకు ఆమె భారత్‌లో ఉండేందుకు న్యూఢిల్లీ తాత్కాలిక అనుమతులు ఇచ్చినట్లు సదరు కథనాలు పేర్కొన్నాయి. ఈ సమయంలో హసీనాకు భారత్ సంస్థాగతంగా పూర్తి సహకారం అందించనున్నట్లు తెలుస్తోంది.

ఐరాసతో దర్యాప్తు జరిపించాలి: యూకే
మరోవైపు బంగ్లాదేశ్ తాజా రాజకీయ పరిణామాలపై బ్రిటన్ ప్రభుత్వం స్పందించింది. గత రెండు వారాలుగా అల్లర్ల కారణంగా చోటుచేసుకున్న హింసాత్మక ఘటనలు, ప్రాణ నష్టంపై ఐక్యరాజ్యసమితి నేతృత్వంలో దర్యాప్తు జరిపించాలని అభిప్రాయపడింది. ప్రభుత్వ మార్పు శాంతియుతంగా జరిగేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరింది. ఈ మేరకు యూకే విదేశాంగ కార్యదర్శి అధికారిక ప్రకటన విడుదల చేశారు. అయితే, ఇందులో షేక్ హసీనాకు ఆశ్రయమిచ్చే అంశాన్ని ప్రస్తావించకపోవడం గమనార్హం. హసీనా సోదరి రెహానా యూకే పౌరురాలు. ఆమె కుమార్తె తులిప్ సిద్దిఖీ ప్రస్తుతం లేబర్ పార్టీ తరఫున పార్లమెంట్ సభ్యురాలిగా ఉన్నారు. ప్రస్తుతం యూకేలో లేబర్ పార్టీనే



అధికారంలో ఉంది. ఈ క్రమంలోనే హసీనా బ్రిటన్ ప్రభుత్వాన్ని ఆశ్రయం కోరినట్లు తెలుస్తోంది.

మేఘాలయలో కర్ఫ్యూ..
మరోవైపు, బంగ్లాదేశ్‌లో నెలకొన్న కల్లోల పరిస్థితులను భారత ప్రభుత్వం నిశితంగా గమనిస్తోంది. దీనిపై చర్చించేందుకు అఖిలపక్షం సమావేశమైంది. బంగ్లా సరిహద్దు రాష్ట్రాలు కూడా అప్రమత్తమయ్యాయి. మేఘాలయలోని అంతర్జాతీయ సరిహద్దు వెంబడి నిరవధిక కర్ఫ్యూ విధిస్తున్నట్లు రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించింది. అటు.. బంగ్లాలో ఉద్రిక్త పరిస్థితుల దృష్ట్యా రెచ్చగొట్టే వీడియోలు షేర్ చేయొద్దని పశ్చిమ బెంగాల్ ప్రభుత్వం విజ్ఞప్తి చేసింది. వాటిని వ్యాప్తి చేస్తే రాష్ట్రంలో అసమ్మతి, అశాంతి రగిలే ప్రమాదం ఉందని హెచ్చరించింది.

# ప్రభాస్‌తో జోడీగా త్రిష

చిత్రసీమలో కొన్ని కాంబినేషన్స్ ఎప్పుడూ కొత్తగానే అనిపిస్తాయి. అలాంటి వాటిలో ప్రభాస్-త్రిష జోడీ ఒకటి. వెండితెరపై హిట్‌పెయిర్‌గా గుర్తుంపుతెచ్చుకుందీ జంట. వారిద్దరు కలిసి నటించిన 'వర్షం' 'బుజ్జిగాడు' 'పౌర్ణమి' చిత్రాలు అభిమానులను ఎంతగానో అలరించాయి. ముఖ్యంగా 'వర్షం' సినిమాలో ప్రభాస్, త్రిష మధ్య పండిన కెమిస్ట్రీని ఎప్పటికీ మరచిపోలేం.తాజా సమాచారం ప్రకారం ఈ హిట్ పెయిర్ మరోసారి ప్రేక్షకులను అలరించేందుకు సిద్ధమవుతున్నట్లు తెలిసింది. సందీప్‌రెడ్డి వంగా దర్శకత్వంలో ప్రభాస్ 'స్పిరిట్' చిత్రంలో నటించబోతున్న విషయం తెలిసిందే. ఇందులో ప్రభాస్ పోలీస్ పాత్రలో కనిపించనున్నారు. ఈ సినిమాలో త్రిషను కథానాయికగా ఖరారు చేయబోతున్నారనే వార్తలు వినిపిస్తున్నాయి. ఇప్పటికే ఈ విషయంలో ప్రాథమిక చర్చలు పూర్తయ్యాయని, త్వరలో అధికారిక ప్రకటన వెలువడుతుందని అంటున్నారు. ఈ ఏడాది చివరలో 'స్పిరిట్' సెట్స్‌మీదకు వెళ్లనుందని సమాచారం. ఇదిలావుండగా ఇటీవలే త్రిష 'బృంద' సిరీస్‌తో ప్రేక్షకుల ముందుకొచ్చింది. ఇందులో ఆమె అభినయానికి ప్రశంసలు లభిస్తున్నాయి.





## అందినట్లే అంది..

పారిస్ ఒలింపిక్స్‌లో త్రుటిలో పతకాలు చేజారడం క్రీడాకారులతో పాటు అభిమానులకు తీవ్ర నిరాశ మిగులుస్తోంది. సూపర్ ఫామ్‌లో ఉన్న వారు సైతం పతక పోరులో వెనుదిరుగుతున్నారు. దాదాపు ఏడెనిమిది పతకాలు చివరి క్షణంలో దూరమయ్యాయి. అయితే ఇతర వరల్డ్ టోర్నీల్లో దుమ్ములేపుతున్న మనవాళ్లు ఒలింపిక్స్‌లో తడబడటానికి కారణం ఒత్తిడే అంటున్నారు క్రీడా నిపుణులు. మానసిక దృఢత్వంలో మనోళ్లను తీర్చిదిద్దితే పతకాలు పెరుగుతాయంటున్నారు.

## బంగ్లాదేశ్‌లో ఆందోళనకు కారణమేంటి?

బంగ్లాదేశ్‌లోని ప్రభుత్వ ఉద్యోగాల్లో 1971 స్వాతంత్ర్య పోరాట కుటుంబాలకు 30 శాతం రిజర్వేషన్లు ఇవ్వడంపై ఆ దేశంలో ఎప్పటి నుంచో నిరసనలు జరుగుతున్నాయి. అయితే సుప్రీంకోర్టు వారి రిజర్వేషన్ల శాతాన్ని 5 కి తగ్గించారు. అయినప్పటికీ నిరసనలు కొనసాగుతున్నాయి. తమను అణిచివేసేందుకు ప్రయత్నించిన ప్రభుత్వం బాధ్యత వహించాలని.. ప్రధాని షేక్ హసీనా రాజీనామా చేయాలంటూ ఆందోళనకారులు డిమాండ్ చేస్తున్నారు.





## బెయిల్ పిటిషన్‌ను విత్‌డ్రా చేసుకున్న కవిత

ఢిల్లీ రౌస్ ఎవెన్యూ కోర్టులో దాఖలు చేసిన డిఫాల్ట్ బెయిల్ పిటిషన్‌ను ఎమ్మెల్సీ కవిత వెనక్కి తీసుకున్నారు. లిక్కర్ పాలసీ స్కామ్‌కు సంబంధించి సీబీఐ కేసులో ఆమె బెయిల్ కోసం కోర్టును ఆశ్రయించారు. నిన్న సీనియర్ న్యాయవాది కోర్టుకు హాజరుకాకపోవడంతో విచారణ వాయిదా వేయాలని ఆమె తరఫు లాయర్ కోరారు. పదే పదే వాయిదాలు కోరడంతో జడ్జి అసహనం వ్యక్తం చేశారు. వాదనలు వినిపించకపోతే పిటిషన్ విత్‌డ్రా చేసుకోవాలని సూచించారు.


## ఓఆర్ఆర్‌పై ఘోర రోడ్డు ప్రమాదం.. తల తెగిపడి వ్యక్తి దుర్మరణం

శంషాబాద్ ఓఆర్ఆర్‌పై ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. మంగళవారం ఉదయం రోడ్డుపై నడుకుంటూ వెళ్తున్న వ్యక్తిని వేగంగా వచ్చిన కారు ఢీకొట్టింది. దీంతో అతడు కారు అద్దంలో ఇరుక్కుపోయాడు. అయితే కారును ఆపకుండా అలాగే కొంత దూరం లాక్కొనిపోవడంతో.. అతని తల తెగి వెనుక సీట్లో పడింది. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకున్నారు. మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని పోస్టుమార్టం నిమిత్తం దవాఖానకు తరలించారు. మృతుడిని శంషాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని ఉట్పల్లికి చెందిన తోట్ల అంజయ్యగా గుర్తించారు. కారు డ్రైవర్‌ను అదుపులోకి తీసుకున్నారు. ఈ ఘటనపై కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

## బంగ్లాదేశ్‌లో ఆందోళనల మాటున హిందూ ఆలయాలపై దాడులు..

### ఇస్కాన్ టెంపుల్ ధ్వంసం

ఉద్యోగాల్లో రిజర్వేషన్ల వ్యతిరేక ఆందోళనలతో బంగ్లాదేశ్‌లో రాజకీయ అస్థిరత ఏర్పడింది. ప్రజా ఉద్యమానికి జడిసి ప్రధాని షేక్ హసీనా తన పదవికి రాజీనామా చేశారు. దీంతో రంగంలోకి దిగిన ఆర్మీ తాత్కాలిక ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయనున్నట్లు ప్రకటించింది. కాగా, రిజర్వేషన్ల ఆందోళనల మాటున దేశంలో హిందూ ఆలయాలపై దుండగులు దాడులకు పాల్పడుతున్నారు. ఇందులో భాగంగా ఖుల్నా డివిజన్‌లోని మెహర్‌పూర్‌లో ఉన్న ఇస్కాన్ టెంపుల్‌పై దాడిచేశారు. ఆలయాన్ని ధ్వంసం చేసిన గుర్తుతెలియని వ్యక్తులు.. విగ్రహాలను పగులగొట్టారు. ఆ ప్రతిమలను కాల్చివేశారు. దేశంలో కొన్ని రోజులుగా కొనసాగుతున్న అల్లర్లు పతాక స్థాయికి చేరడంతో ప్రధాని పదవికి షేక్ హసీనా రాజీనామా చేశారు. ఉద్యోగాల్లో రిజర్వేషన్లు కల్పించేందుకు ఆమె చేసిన ప్రయత్నానికి వ్యతిరేకంగా మొదలైన ఉద్యమం చివరకు ఆమెనే గద్దె దింపింది. ప్రపంచంలోనే ఎక్కువ కాలం



ప్రభుత్వాధినేతగా పనిచేసిన మహిళగా ఘనత వహించిన హసీనా ప్రజా ఉద్యమానికి జడిసి పదవిని వదులుకున్నారు.
ఎన్నికల్లో తిరుగులేని ప్రజాతీర్పుతో అధికారంలోకి వచ్చిన ఆరు నెలల్లోనే అవమానకర రీతిలో దేశాన్ని వీడి పరారయ్యారు. భారత్ చేరుకున్న ఆమె మరికొన్నిరోజుల పాటు ఇక్కడే ఉండనున్నట్లు తెలుస్తున్నది. రాజకీయ శరణార్థిగా యూకే ఆశ్రయం కోరినట్లు తెలుస్తున్నది. దీనిపై యూకే ప్రభుత్వం నుంచి అనుమతి రాగానే అక్కడికి వెళ్లనున్నారు. కాగా, రహస్య ప్రదేశంలో ఉన్న హసీనాను.. జాతీయ భద్రతా సలహాదారు అజీత్ దోభాల్ కలిశారు.

## పెళ్లికి నో అంటున్న చైనా యువత.. ప్రభుత్వం వర్రీ



జననాల రేటు పడిపోవడం, వృద్ధుల రేటు పెరుగుతుండటం చైనా ప్రభుత్వాన్ని ఆందోళనకు గురి చేస్తోంది. దీనికి ముఖ్య కారణం అక్కడి యువత పెళ్లిపై విముఖత చూపడమే. ఉద్యోగాల్లో స్థిరపడ్డాకే వివాహం చేసుకోవాలని వారు భావిస్తుండటం సమస్యగా మారింది. పిల్లల్ని కన్నవారికి ప్రోత్సాహకాలు ఇస్తామన్నా యువత పట్టించుకోవడం లేదు. ఈ ఏడాది మొదటి 6 నెలల్లో 34 లక్షల జంటలు పెళ్లి చేసుకోగా, గతేడాది ఇదే సమయానికి ఈ సంఖ్య 38.98లక్షలుగా ఉంది.

## అప్పుడు శ్రీలంక..ఇప్పుడు బంగ్లాదేశ్

బంగ్లాదేశ్ పీఎం పదవికి రాజీనామా చేసి హసీనా దేశం విడిచి వెళ్లారు. ఆందోళనకారులు ఆమె ఇంట్లోకి చొరబడి వస్తువులు ఎత్తుకెళ్తున్నారు. ఇలాంటి ఘటనే 2022లో శ్రీలంకలో జరిగింది. అధ్యక్షుడు రాజపక్స దేశం విడిచి పారిపోగా ఆయన అధికారిక నివాసంలోకి నిరసనకారులు ప్రవేశించి స్విమ్మింగ్ పూల్‌లో ఈత కొట్టారు. వస్తువులు ధ్వంసం చేశారు. బంగ్లాలో నిరసనలకు రిజర్వేషన్లు కారణమైతే శ్రీలంకలో ఆర్థిక సంక్షోభం ఆందోళనకు దారి తీసింది.